అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

బెజ్జూరు, జనవరి 14: మండలకేంద్రంలో ఆదివారం అయోధ్య పూజితఅక్షింతలను పంపిణీచేశారు. ముందుగా మండల కేంద్రంలోని శివాలయంలో అక్షింతలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులంతా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.



అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

మానవీయ దృక్పథంతో చూడాలి

● ఆదివాసీల అరెస్టుపై మానవ హక్కుల వేదిక సభ్యులు



గ్రామస్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మానవహక్కుల వేదిక సభ్యులు

వాంకిడి, జనవరి 14: పాలకులు, సమాజం పులులకు ఇచ్చే విలువను మనుషులకు ఇవ్వకపోవడం మాని మానవీయ దృక్పథంతో విషయాన్ని చూడాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధానకార్యదర్శి ఎస్ తిరుపతయ్య అన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాంలో ఈనెల 6, 8 తేదీల్లో మరణించిన రెండు పెద్ద పులల విషయంలో వాంకిడి మండలం రింగారెట్ గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీ యువకులు ఉద్దేశపూర్వకంగా పులులు చంపినట్లు నేరం మోపి వారిని రిమాండ్‌కు పంపిన కేసులో ఆదివారం వారు నిజనిర్ధారణ జరిపారు. అనంతరం వాంకిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాంకిడి మండలం రింగారెట్, చెరుకుపల్లి, దరిగాం గ్రామాల నుంచి ఆదివాసీ ప్రజల పశువులు ఆహారం కోసం దరిగాం అటవీకి వెళ్తాయి. ఈ నేపథ్యంలో రింగారెట్ గ్రామానికి చెందిన కోవ గంగు ఆవు నెలరోజుల క్రితం దరిగాం అడవిలో తప్పిపోయింది. ఆవు తిరిగి వస్తుందేమోనన్న ఆశతో దాని యజమాని అటవీ అధికారులకు తెలియజేయలేదు. కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరిధిలోకి వచ్చే దరిగాం అడవిలో పులి చనిపోయిందనే సమాచారం గ్రామస్థులు ఇస్తే తప్ప అటవీ అధికారులకు తెలియలేదు. తదనంతరం వారు పులులు చనిపోవడానికి పరిసర ప్రాంతాల రైతులు లేదా పశువుల కాపరులే కారణమై ఉంటారని అనుమానంతో సిడాం రాము అనే 12 సంవత్సరాల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని చేత కోవ గంగు, ఆత్రం జలపతులే పులుల మరణానికి కారణమని చెప్పించారు. కోవ గంగును, ఆత్రం జలపతితోపాటు మరికొంత మందిని అదుపులోకి తీసుకొని చితకబాదారు. కేవలం దెబ్బలకు తట్టుకోలేక మాత్రమే తాము చేయని నేరాన్ని ఒప్పుకుంటున్నామని గంగు, జలపతులు చెప్పారని వారి బంధువులు మాకు తెలియజేశారు. కోర్టులో నేరం రుజువైనా, కాకపోయినా పులుల మరణాలకు గల కారణాలను, అడవుల్లో ఆదివాసీల పరిస్థితిని మానవీయ కోణంతో పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. అడవులు పులులకే కాదు ఆదివాసులకు కూడా మాతృస్థలాలని అడవుల్లో ఈ రోజు పులులకే కాదు ఆదివాసులకు, వారి పశుసంపదకు కూడా రక్షణ లేదన్నారు. గత సంవత్సరం సిడాం భీము అనే పత్తి రైతుపై పులి దాడిచేసి చంపేసింది. నెల రెండు నెలలకొక ఆవు లేదా ఎద్దు, ఇంకా గొర్రెలు, మేకలు పులుల బారిన పడి చనిపోతున్నాయి. పులుల బారినపడి చనిపోయే గొర్రెలు,మేకలకు పరిహారం ఇచ్చే వెసులుబాటు చట్టంలో లేదట.. కానీ మనుషులు, ఎద్దులకు మాత్రం ప్రభుత్వం, అటవీ అధికారులు నామమాత్రపు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కానీ పులులు చనిపోతే మాత్రం ఆదివాసీ ప్రజలను జైళ్లకు పంపుతున్నారు. పాలకులు, సమాజం పులులకు ఇచ్చే విలువను మనుషులకు ఇవ్వకపోవడం మాని మానవీయ దృక్పథంతో విషయాన్ని చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్, సభ్యులు ఆత్రం సాయుధ, నూతన్, మరప సురేష్ ఉన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



ఆగర్‌గూడలో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పెంచికలపేట, జనవరి 14: అటవీసమీప గ్రామాల ప్రజలు వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎఫ్‌ఆర్వో ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆగర్‌గూడ, గుండెపల్లి గ్రామాల్లో వన్య ప్రాణి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడానికి కరెంటు తీగలు, ఉచ్చులు పెడితే చట్టరీత్యా నేరమని ఇందుకు మూడునుంచి ఏడుసంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడుతుందన్నారు. ఒకవేళ పశువులు వన్యప్రాణుల దాడివల్ల గాయపడినా, చనిపోయినా పరిహారం చెల్లిస్తా మన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు వెంకటేష్, సర్పంచ్ సుధాకర్, లచ్చయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

లభించని రెండు పులుల ఆచూకీ



అడవిలో బిగించిన ట్రాప్ కెమెరా

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 14: కాగజ్‌నగర్ దరిగాం అటవీప్రాంతంలో విషాహారంతో రెండు పులులు మృతిచెందగా మిలిగిన పులుల ఆచూకీ లభించడంలేదు. వారంరోజులుగా గాలింపు కొనసాగిస్తున్నా ఎలాంటి ఫలితంలేదు. ట్రాకర్స్, వాచర్స్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు దరిగాం అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. దరిగాం బురదమామిడి వద్ద చనిపోయిన ఆవు కళేబారాన్ని తింటుండగా ట్రాప్ కెమెరాల్లో నాలుగు పులులున్నట్టు సమాచారం. అందులో రెండు మృతిచెందగా మిగితా పులుల కోసం వందలాది ట్రాప్ కెమెరాలను అమర్చారు. దాదాపు 25మంది బృందాలతో అటవీప్రాంతాన్ని జల్లెడపట్టారు. అయినా ఎలాంటి ఫలితం లేదు. జిల్లా అటవీశాఖ అధికారులు ఇక్కడే బసచేసి ఎప్పటికప్పుడు పులికోసం ఆరా తీస్తున్నారు. దరిగాం, సర్కేపల్లి, రెంగారీట్, రేగులగూడ, గోంది, ఊటేపల్లి, చారిగాం తదితర గ్రామాలగిరిజనుల నుంచి అధికారులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. డీఎఫ్‌వో నీరజ్‌టిబ్రేవాల్ కాగజ్‌నగర్‌లోనే ఉంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పులుల ఆచూకీ, పగ్‌మార్క్ కోసం సిబ్బందికి సూచనలిస్తున్నారు.



కు.ని. శిబిరాల జాడేది?

● జిల్లాలో సర్జన్‌ల కొరత ● మూడేళ్లుగా ఎదురుచూపులు ● ఇబ్బందులు పడుతున్న మహిళలు

బెజ్జూరు, జనవరి 14: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మూడేళ్లుగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. కు.ని. శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కరోనా విజృంభణ కాలం నుంచి శిబిరాల నిర్వహణ పూర్తిగా నిలిపివేశారు. కరోనా పూర్తిగా నియంత్రణలోకి వచ్చినా అప్పటి ప్రభుత్వం కు.ని. శిబిరాలు ఏర్పాటు చేయలేదు. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా దీనిపై శ్రద్ధ వహించాలని పేదప్రజలు కోరుతున్నారు. కు.ని. శస్త్ర చికిత్సలు చేయని కారణంగా పేద ప్రజలకు ఆర్థిక భారం పడుతోంది. గ్రామీణ ప్రాంతాల పేద మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్‌లో ప్రాంతీయ ఆసుపత్రులున్నాయి. వాటితోపాటు జిల్లాలో 22ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. కరోనాకు ముందు జూలైలో మాత్రమే ఒక్క కాగజ్‌నగర్‌లో మాత్రమే కు.ని. శిబిరం నిర్వహించారు. గతంలో కరోనాకు ముందు కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం కు.ని. శిబిరాలు నిర్వహించేవారు. రాన్రాను ఎందువల్లో శిబిరాలను పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసుకుంటే ఉచితంగా జరిగేవని ప్రైవేటుకు వెళ్లడం ద్వారా వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని మహిళలు వాపోతున్నారు.

● **గతంలో ఏడాదికి రెండుసార్లు శిబిరాలు..**

గత నాలుగైదు ఏళ్లుగా జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసు పత్రుల్లో ఏడాదికి రెండుసార్లు చొప్పున కు.ని. శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకునే వారికి ప్రోత్సాహకంగా గత ప్రభుత్వం రూ.880, వారిని శిబిరాలకు తరలించిన ఆశా కార్యకర్తలకు రూ.150 చెల్లించేవారు. ముఖ్యంగా జిల్లాలోని బెజ్జూరు, పెంచికలపేట, దహెగాం, చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల్లోని పలువురు పక్కనే ఉన్న మహారాష్ట్రలోని పలు ఆసుపత్రుల్లో అధికంగా శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలు ఏర్పాటు చేయని కారణంగా అవస్థల మధ్య మహారాష్ట్రకు వెళ్లి చేయించుకుంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో గతంలో ప్రతి ఏటా శిబిరాలు ఏర్పాటు చేసిన అధికారులు కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో సరైన వసతులు లేవనే సాకుతో నిలిపివేశారు.

కాగా కు.ని. శిబిరాలపట్ల నిర్లక్ష్యం వహించడం ఎంతమాత్రం సరికాదని ప్రజలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లోని పేదలు కొందరు శస్త్రచికిత్స కోసం ఎదురు చూస్తున్నారు.

● **వేధిస్తున్న సర్జన్‌ల కొరత..**

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్జన్ డాక్టర్ల కొరత వేధిస్తుండటంతో కు.ని. శిబిరాల నిర్వహణ కష్టంగా మారింది. గతంలో జిల్లాలో కొంతమంది సర్జన్‌లు ఉండటంతో అక్కడక్కడా కు.ని. శిబిరాలు నిర్వహించే వారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేయడానికి డాక్టర్లు మొగ్గుచూపని కారణంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తక్కువ వేతనాలు, ఇతర సౌకర్యాలు లేక కొత్తగా డాక్టర్లు రావడానికి ఇష్టపడటం లేదన్న వాదనలు ఉన్నాయి. దీంతో గత కొద్దేళ్లుగా శిబిరాలు నిర్వహించడం లేదు. ఇక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో ఈసారైనా శస్త్ర చికిత్సలు ఏర్పాటు చేస్తారేమోనని గ్రామీణ ప్రాంత పేదలు ఎదురుచూస్తున్నారు.

ఆదేశాలు వస్తే కు.ని శిబిరాలు నిర్వహిస్తాం..

- తుకారాం భట్, జిల్లా వైద్యాధికారి, ఆసిఫాబాద్



జిల్లాలో సర్జన్ డాక్టర్ల కొరత వేధిస్తోంది. దీంతో కొన్నేళ్లుగా కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిం చడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. గ్రామీణ ప్రాంతాల వారికి ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. ఇప్పటికే ఈ విషయంలో ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. రాబోయే రోజుల్లో కు.ని శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

ఊరూ.. వాడ.. సంక్రాంతి సందడి

● ఘనంగా బోగి ● నేడు సంక్రాంతి ● రేపు కనుమ



ఆసిఫాబాద్‌లో వాయినాల కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



బెజ్జూరు వారసంతలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్, జనవరి 14: జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. ఆదివారం జిల్లావ్యాప్తంగా బోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను ఘనంగా జరుపుకోనున్నారు. దీంతో మార్కెట్‌లో సందడి నెలకొంది. రంగురంగుల ముగ్గులతో ఇంటి లోగిళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు మహిళలు, యువతులు రంగులను కొనుగోలు చేశారు. పండుగవేళ పిండివంటలు తయారు చేసేందుకు సామగ్రిని కొనుగోలు చేయడంతో కిరాణ దుకాణాలు కిటకిటలాడాయి. ఇళ్లలో పిండి వంటలను తయారిలో మహిళలు, యువతులు నిమగ్నమయ్యారు. యువత, చిన్నారులు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు ప్రజలు బయలుదేరి రావడంతో పల్లెల్లో పండుగ సందడి నెలకొంది. కనుమరోజు మహిళలు వాయినాలను ఇచ్చేందుకు వస్తు సామగ్రిని కొనుగోలు చేస్తుండడంతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

వార సంతలో సంక్రాంతి శోభ

బెజ్జూరు: గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. ఆదివారం మండలకేంద్రంలో వారసంత కావడంతో మహిళలు ముగ్గుల రంగులు, నిత్యావసర సరుకులు, నోముల సామగ్రి కొనుగోలు కోసం బారులు తీరారు. సంక్రాంతి అంటేనే కొత్త ఇంటికి వచ్చిన అల్లుళ్లతో సంబరాలు, పంటచేతికి వచ్చిన సందర్భంగా కుటుంబాల్లో ఆనందోత్సవాలు నెలకొంటాయి. అలాంటి సంక్రాంతిని ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల ముందు అందమైన రంగువల్లులు, బసవన్నల డూడూ విన్యాసాలు, పిండి వంటలతో ఇళ్లన్నీ సంక్రాంతి వెలుగులు నింపుతున్నాయి.

ఘనంగా మరట్వాడ నామాంతర్ దివస్



పూజలు నిర్వహిస్తున్న బీఎస్‌ఐ సభ్యులు

వాంకిడి, జనవరి 14: మండలకేంద్రంలో ఆదివారం బీఎస్‌ఐ ఆధ్వర్యంలో మరట్వాడ విద్యపీఠ్ నామంతర్‌దివస్‌ను ఘనంగాజరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్, గౌతమబుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలువేసి పూజలు నిర్వహించారు. 1994జనవరి 14న ఔరంగాబాద్‌లో మరట్వాడ విద్యాపీఠానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మరట్వాడ విశ్వవిద్యాలయంగా పేరు మార్పు చేశారని బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావు, రోషన్, విలాస్, విఠల్, రమేష్, ప్రతాప్, నాగేష్, రాకేష్, రాజేశ్వర్, పాండు, ధర్మ, ప్రదీప్, నానాజీ, బలవంత్ రావు, తుకుడు, చేతన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే5 గనిలో బండకూలి కార్మికుడికి తీవ్రగాయాలు

శ్రీరాంపూర్, జనవరి 14: శ్రీరాంపూర్‌లోని ఆర్కే5 గనిలో బండ కూలి కార్మికుడు తీవ్రంగా గాయప డ్డాడు. సహచర కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. జరుపుల నాగేష్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు శనివారం నైట్‌షిఫ్ట్ డ్యూటీకి వచ్చి, యాక్టింగ్‌కోల్‌కట్టర్‌గా విధులు నిర్వహించేందుకు వెళ్లాడు. తెల్లవారుజామున 4.40 గంటల ప్రాంతంలో బ్లాస్టింగ్ జరుగగా, చటాయి చేసేందుకు 4వసీమ్ 21 1/2 లోని పనిస్థలంలోకి వెళ్లాడు. చటాయి చేస్తుండగా భారీబండ ఆయనపై కూలింది. మిగతా కార్మికులు వెంటనే స్పందించి బండకింది నుంచి అతన్ని బయటికి తీసి సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడి నడుము కిందిభాగంలో ఎముక ఫ్యాక్చర్ అయ్యిందని, కిడ్నీలకు దెబ్బతగిలిందని గుర్తించిన వైద్యులు కరీంనగర్‌కు రిఫర్ చేశారు. అక్కడ వైద్యం చేసిన అనంతరం వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం నాగేష్ హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పరామర్శించిన సీతారామయ్య..


జరుపుల నాగేశ్ అనే కార్మికుడు ఆర్కే5 గనిలో గాయపడి ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య ఆయనను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేయాలని వైద్యులకు సూచిం చారు. ఆయన వెంట ఉపప్రధానకార్యదర్శి కె వీరభద్రయ్య, ఏరియాకార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్‌కార్యదర్శి గునిగంటి నర్సింహారావు, నాయకులు సత్తిరెడ్డి, అఫ్రోజ్‌ఖాన్, తదితరులున్నారు.

లాభాల వాటా, బోనస్ కోసం ఎదురుచూపులు



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డు కార్మికులు(ఫైల్)

మందమర్రి టౌన్, జనవరి 14: సింగరేణిలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన రిటైర్డు కార్మికులు దీపావళి బోనస్, 2022-23 లాభాల వాటాతోపాటు వేజ్‌బోర్డు, ఏరియర్స్ కోసం ఎదురుచూస్తున్నారు. విరమణ పొంది నెలలు గడుస్తున్నా వాటి చెల్లింపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం డైరెక్టర్ బలరాంను కలిసి వినతి పత్రం సమర్పించారు. బెల్లంపల్లి రీజియన్‌లో రిటైర్డ్ కార్మికులంతా వారం రోజులుగా సమావేశాలు పెట్టి వారిబాధలను వెళ్లిబుచ్చు తున్నారు. మందమర్రిలో రెండురోజుల క్రితం అంబేద్కర్‌విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగ విరమణపొందిన తర్వాత వచ్చిన డబ్బులు పిల్లల పెండ్లిలు, అప్పులకే సరిపోయాయని, డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల బాధలను అర్థం చేసుకోవాలని వారు పేర్కొంటున్నారు. నాలుగు దశాబ్దాలపాటు సంస్థ అభివృద్ధికి పనిచేసి విరమణ పొందడంతో డబ్బులు వెంటనే చెల్లించడం ద్వారా యాజమాన్యానికి రుణపడి ఉంటామని వారు పేర్కొంటున్నారు. త్వరలోనే జీఎంలకు వినతిపత్రాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.







ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | డిఎస్‌ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్2 నోవ - మల్లాపూర్ | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్‌ఎమ్ - మదీనగూడ | టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
మంత్రామాల్ - అత్తాపూర్ | మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ | జె.పి.సినిమాస్ - చందానగర్

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

భీమారం, జనవరి 14 : భీమారం మండలంలో కోడిపందెల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. చింతం బాబు, ఆకుదారి శ్రీనివాస్‌లను పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయినట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. వారివద్ద నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోడి పందెలు ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరి బైండోవర్

హాజీపూర్, జనవరి 14: మండలంలో కోడిపందేలు నిర్వహించకుండా తహసీల్దార్ సతీష్‌కుమార్ ఎదుట ఆదివారం ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. పెద్దంపేటకు చెందిన తనుగుల రమేష్, టీకనపల్లికి చెందిన గంగధరి తిరుపతిలను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఉద్యోగం పెట్టిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

హాజీపూర్, జనవరి 14: రాపల్లి గ్రామానికి చెందిన రాజేష్‌వర్మ అనే వ్యక్తికి ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన అదే గ్రామానికి చెందిన మందపెల్లి శ్రీనివాస్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలి పారు. రాజేష్ వర్మకు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా ఉద్యోగం పెట్టిస్తానని చెప్పి శ్రీనివాస్ 2016లో రూ.2 లక్షలు తీసుకున్నాడు. అప్పటినుంచి ఇప్పటివరకు ఉద్యోగం పెట్టించక పోవడంతో డబ్బులు ఇవ్వాలని రాజేష్‌వర్మ కోరాడు. విడతల వారీగా రూ.1.50 లక్షలను శ్రీనివాస్ రాజేష్‌వర్మకు ఇచ్చాడు. మిగితా రూ.50వేలు ఇవ్వాలని కోరగా బెదిరించాడన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చైనామాంజ నిషేధం

ఏసీసీ, జనవరి 14: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చైనామాం జను నిషేధించామని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి చైనామాంజను అమ్మినా, కొన్నా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా చైనామాంజ విక్రయించే దుకాణాలపై నిఘా పెట్టామని, అధికారులు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. చైనామాంజ వల్ల పక్షులకు, మనుషులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అమ్మిన వారికి గరి ష్టంగా 7 ఏండ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తామన్నారు.

దొంగ పట్టివేత

హాజీపూర్, జనవరి 14: మండలంలోని రాపల్లి గ్రామంలో చోరీకి పాల్పడిన దొంగను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 11న గుండ ఐలయ్య అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితుని ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆదివారం కర్ణమామిడి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా దొంగను పట్టుకున్నామన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ చెందిన జెట్‌పాట్ పవన్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని, నిందితున్ని అరెస్టు చేసి దొంగలించిన సొమ్మును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మ్యాదరిపేటలో భారత్ సంకల్ప్ యాత్ర

దండేపల్లి,జనవరి 14: మ్యాదరిపేటలో ఆదివారం భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. వీడియో స్క్రీన్ ద్వారా ప్రధాని ప్రసంగం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికారి ప్రతినిధి జాడి బాలారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిం చారు. సర్పంచు ఢాంకా లక్ష్మణ్, నోడల్ అధికారి శ్రీనివాస్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, నాయకులు సంతోష్, మల్లేష్, వెంకటేష్, కిషన్, పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

బెల్లంపల్లి, జనవరి 14: మార్కెట్ చౌరస్తావద్ద తిలక్‌గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. సభ్యులుమాట్లాడుతూ ప్రతీఆదివారం భవననిర్మాణ కార్మికులు, కూలీలకుమార్కెట్ చౌరస్తావద్ద అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. రాజన్న, రామన్న, నాగేష్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కనకయ్యగౌడ్, లింగయ్య, రమేష్ , వెంకటరాజం, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణం



కల్యాణం సందర్భంగా తాళిని చూపిస్తున్న పండితుడు

కాగజ్‌నగర్, జనవరి 14: కాగజ్‌నగర్ పట్టణంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం స్థానిక ఆలయాల్లో అట్టహాసంగా జరిగింది. స్థానిక ఆర్‌ఆర్‌వో కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో కల్యాణ కార్యక్రమం జరిగింది. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుడు కమలాకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు వివిధ కల్యాణ మహోత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకుని పూజల్లో పాల్గొన్నారు.

వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత అందరిది



సిర్పూర్(టి) మండలం చీలపల్లిలో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

సిర్పూర్(టి)/దహెగాం, జనవరి 14: వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎఫ్‌ఆర్వోలు పూర్ణచందర్, నిజామొద్దీన్ అన్నారు. ఆదివారం సిర్పూర్(టి) రేంజ్‌పరిధిలోని చీలపల్లి, ఇటిక్యాలపహాడ్, లింబుగూడ, మాకిడి, మాలిని, చింతకుంట, భూపాలపట్నం, కేశవపట్నం, జక్కాపూర్, దహెగాం మండలం లోని లోహ, దిగిడ గ్రామాల్లో వారు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడినా, వాటికి హానికలిగించినా, ఉచ్చులు బిగించినా వన్యప్రాణి చట్టం ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పులిదాడిలో పశువులు చనిపోయినా, గాయపడ్డా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో బీట్‌అధికారులు షేక్‌షాహిద్, నరేష్‌ప్రభాకర్, అరవింద్, రవీనా, సంతోష్, దహెగాంలో ఎఫ్‌బీవో శ్రీధర్‌చారి, ఎఫ్‌ఎస్‌వోలు సతీష్, బాబు, సద్దాం, వెంకటేష్, పోశన్న, సర్పంచ్ సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఆటోల బంద్

కాగజ్‌నగర్, జనవరి 14: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ఆటో డ్రైవర్లు బంద్ పాటించారు. మహాలక్ష్మి పథకంతో తమకు ఉపాధి లేకుండా పోతోందని ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని బంద్ నిర్వహించారు. ఆటోయూనియన్ నాయకులిచ్చిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆటోలు లేక పోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఐక్య ఉద్యమాలతో హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

కాసిపేట, జనవరి 14: మున్నూరు కాపులందరు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్య ఉద్యమాలు చేసి హక్కులు సాధించుకోవాలని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మున్నూరు కాపుల్లో ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవాలన్నారు. మెరిట్ విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తూ ఉన్నత విద్య కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సంఘం క్యాలెండర్లను విడుదల చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లచ్చన్నపటేల్, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, మండల అధ్యక్షుడు అగ్గి సత్తయ్య పటేల్, శ్యాంపటేల్, సతీష్, తిరుపతి, గోపాల్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జన్నారం, జనవరి 14: మండలంలోని ఆదివాసీ గూడల ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సన్మానించారు. గూడాల్లోని తాగునీరు, రోడ్లు, తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సోనేరావు, హన్మంత్‌రావు, జంగు పటేల్, బొజ్జు, వసంత్, మానిక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

● మంచిర్యాల, నస్పూర్‌లో రోజూ నీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే పీఎస్సార్



నల్లా నీటిని దోసిలితో పట్టుకుని తాగుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, నస్పూర్‌లో నల్లాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఏసీసీ, జనవరి 14: తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని, తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో రోజు గంటన్నర తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నల్లా నీటిని దోసిలితో పట్టుకుని ప్రేంసాగర్‌రావు సురేఖ దంపతులు తాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజు శుద్ధమైన మంచినీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఉదయం గంట, సాయంత్రం అరగంట నీటిని సరఫరా చేస్తామన్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని తెచ్చుకుని తాగాల్సిన అవసరం ఇకపై ఉండదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వారం రోజుల్లో రూ.15 లక్షలతో చెన్నై నుంచి షీట్ తెప్పించి రోడ్డు వేయించానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో క్వింటాల్‌కు 10 కిలోల తగ్గించి లెక్క కట్టారని, కొనుగోళ్లలో తరుగు తీయవద్దని అధికారులను ఆదేశించానన్నారు. గూడెం లిఫ్ట్ ద్వారా నీరు ఇచ్చేందుకు మోటార్లు స్టార్ట్ చేస్తే పైపులు పగిలి పోయేవన్నారు. ఎనిమిదేళ్ళుగా ఇదే జరిగిందని, ఈ సారి రెండు మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసిన పైపులు పగలడం లేదన్నారు. హమాలీవాడ కట్ట పోచమ్మ వద్ద డ్వాక్రా భవనం, వాకర్స్ అసోసియేషన్ భవనాల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించానని, నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందుతాయని, ఎవరు అధైర్యపడవద్దన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపిన ప్రకారం ఇప్పటికే మహాలక్ష్మీ, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించే రూ.15 లక్షల పెంపు పథకాన్ని అమలు చేసిందన్నారు. ప్రజాపాలనలో మంచిర్యాల మున్సిపాలిటీలో 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటిని ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తామన్నారు. పబ్లిక్ హెల్త్,రూరల్ వాటర్ సప్లయి, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఎమ్మెల్యే సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈలు వెంకటేష్, మధుసూదన్, గంగాధర్, డీఈ శ్రీనివాస్, ఏఈ అనిల్, రాజేందర్, మధుకర్, నాయకులు రావుల ఉప్పలయ్య, సల్ల మహేష్, కౌన్సిలర్ పూదరి సునీత, తూముల నరేష్, పూదరి తిరుపతి పాల్గొన్నారు.

నస్పూర్: రోజు స్వచ్ఛమైన తాగునీటిని రెండు పూటల సరఫరా చేస్తామని, వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. 14వ వార్డు రాజీవ్‌నగర్‌లో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో నీటి పథకాలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, ఏఈ మధులను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో మంచినీటి ట్యాంకర్ల అవసరం రాకుండా చర్యలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను పండగ తర్వాత కూల్చివేస్తామని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను ఇచ్చి ఇందిరమ్మ పథకం మంజూరు చేస్తామన్నారు. చెత్త డంపింగ్ యార్డు కోసం 25 ఎకరాలను గుర్తించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నస్పూర్ మున్సిపాలిటీకి రూ.73 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు వచ్చాయని, 30 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం, ఏడు చోట్ల ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తామన్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ళ వేణు, కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, సీపతి సుమతి, సంధ్యారాణి, గెల్లు రజిత, తెనుగు లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీఓదెలు, బహుమతులు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మందమర్రిరూరల్, జనవరి 14 : సంక్రాంతికి ఇంటి ముందు ముగ్గులు వేయడం తెలంగాణ సంప్రదాయమని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు పేర్కొన్నారు. ఆదివారం ఆదిల్‌పేటలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ఆమె హాజరయ్యారు. మహిళలు అందమైన ముగ్గులు వేసి అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. నాయకులు ఒడ్నాల కొమురయ్య, గందె రాంచందర్, కదారి జీవన్‌కుమార్, నర్సింగోజు తిరుపతి, రాజేష్, పున్నం, సునీల్, పున్నం పాల్గొన్నారు.

భీమిని: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్ పేర్కొన్నారు. లక్ష్మీపూర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. పీఏసీఎస్ చైర్మన్ నారాయణ, బండి శ్రీవాణిశ్రీకాంత్ గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట రూరల్: పాత కొమ్ముగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన ముగ్గురికి బీజేపి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు బహుమతులు అందజేశారు. బొప్పు కిషన్, ప్రభాకర్ హేమంత్‌రెడ్డి సతీష్ పాల్గొన్నారు.

దండేపల్లి: తెలంగాణ సంస్కృతి సంప్రదా యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. నాగసముద్రం, చెల్కగూడంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

నెన్నెల: దేశ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ న్యాతరి స్వామి అన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్ ఆధ్వర్యంలో నార్వాయిపేటలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఎంపీటీసీలు బొమ్మెన హరీష్‌గౌడ్, దాగం రమేష్, సర్పంచ్ తోట సుజాతశ్రీనివాస్, నాయకులు కిషన్‌రెడ్డి, గట్టు బానేష్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

శ్రీరాంపూర్, జనవరి 14: మంచిర్యాల రెడ్డి సంఘం సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సంఘం క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, సంఘం కోసం సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలను నిరుపేద రెడ్డి కులస్థులకు అందేలా చూస్తానని తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు చెరుకు మధుసూదన్ రెడ్డి, అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి చందుపట్ల చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మద్దుల మనోహర్ రెడ్డి, కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి, తిరుమల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

భారత్ న్యాయ్ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

మందమర్రి టౌన్, జనవరి 14: మణిపూర్ నుంచి ముంబైవరకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ న్యాయ్‌యాత్రకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిహాజరయ్యారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఈ యాత్రకు అన్నిరాష్ట్రాల నుంచి నాయకులు హాజరయ్యారన్నారు. అలాగేమంత్రి సీతక్క, షర్మిలతో కలిసి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. యాత్ర కేంద్రప్రభుత్వ విధానాలను ఎండగడుతూ సాగుతుందని, ప్రజలను చైతన్యం చేస్తూ ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దీని ప్రభావం చూపబోతుందని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే వివేక్

విద్యుత్‌తీగ తగిలి ఒకరు మృతి



మృతిచెందిన కొట్నాక భీమ్‌రావు

సిర్పూర్(యు), జనవరి 14: మండలంలోని శెట్టిహడ్పనూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల చాప్రి గ్రామసమీప అటవీ ప్రాంతంలో అడవిజంతువులను వేంటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగనుతాకి ఒకరు మృతిచెందారు. జైనూర్ సీఐ మల్లేష్ కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం చాప్రి గ్రామానికి చెందిన కొట్నాక భీమ్‌రావు(40),అదే గ్రామానికి చెందిన మెస్రం బొజ్జు ఇద్దరూ కలిసి వంటచెరుకు తీసుకురావడానికి అడవికి వెళ్లారు. వంట చెరుకు తీసుకునివస్తుండగా అడవిలో అడవిజంతువులను వేటాడేం దుకు అమర్చిన విద్యుతు తీగను తగిలి కొట్నాక భీమ్‌రావు కింద పడిపోయాడు. గమనించిన మెస్రం బొజ్జు వెంటనే కొట్నాక భీమ్‌రావును కాపాడే ప్రయత్నం చేశాడు. కానీ లాభం లేకుండా పోయింది. ఈ విషయాన్ని గ్రామనికి వచ్చి బీంరావు భార్య పూర్ణ బాయితోపాటు గ్రామస్థులకు తెలిపాడు. వారు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా భీమ్‌రావు మృతిచెంది ఉన్నాడు. మృత్యుడి భార్య కొట్నాక పూర్ణబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానించిన కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్, జనవరి 14: సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబును వివిధ ఆలయాల్లో కమిటీ సభ్యులు ఆదివారం సన్మానించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో కమిటీసభ్యులు, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కమిటీ సభ్యులు, ఇతర కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

వాంకిడి, జనవరి 14: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతిపండగను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకుడు దుర్గం ప్రశాంత్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 50మందికిపైగా యువతులు, మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నారాయణ, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, జనవరి 14: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదివారం హైద్రాబాద్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి పండగ శుభాకాంక్షలను తెలిపారు.

గోండి ధర్మ పరిరక్షణకు యువత కృషిచేయాలి

● ఘన్‌సాంస్థన్ పీఠాధిపతి కుమ్రం భగవంత్‌రావు



మాట్లాడుతున్న ఘన్‌సాంస్థన్ ప్రచారకుడు ఉర్వేత మోహన్

సిర్పూర్(యు), జనవరి 14: అతిప్రాచిన గోండి ధర్మపరిరక్షణకు యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఘన్ సాంస్థన్ వ్యవస్థాపక పీఠాధిపతి కుమ్రం భగవంత్‌రావు అన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకా వసంత్‌వాడి గ్రామంలో ఏర్పాటు చేసిన జంగోలింగో దీక్ష స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక మార్గంతోనే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. జంగోలింగో దీక్షతో మనఃశ్శాంతి కల్గుతుందన్నారు. దీక్షను ప్రతిఒక్కరూ తీసుకొని గోండి ధర్మంను పాటించాలన్నారు. గోండి ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని ఘన్‌సాంస్థన్ ప్రచారకుడు, గోండ్వాన గాయకుడు ఉర్వేత మోహన్ అన్నారు. కార్యక్రమంలో గోండిధర్మ కోయపున్నెం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు, ఘన్ సాంస్థన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడం జగీజిన్, జంగు బాయి చానెల్ మంగం విశ్వంరావు, రాష్ట్ర సభ్యుడు కొట్నాక మోహ పత్‌రావు, ఆత్రం కిషన్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పతంగులు పంపిణీ



చిన్న పిల్లలతో అమ్మెదీవెన సంస్థ సభ్యులు

ఆసిఫాబాద్, జనవరి 14: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆసిఫాబాద్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కు, టీఆర్‌నగర్, సందీప్‌నగర్, తుమ్రిగూడ, బ్రాహ్మణవాడలో చిన్నారులకు అమ్మ దీవెన స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం పతంగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రశాంత్, కృపాల్, నితేష్, ప్రతాప్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, సంతోష్, రాజశేఖర్, అభిలాష్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోతరాజ్ ఉత్సవాలు ప్రారంభం



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

కెరమెరి, జనవరి 14: మండలంలోని కోలాం కోటారి గ్రామంలో కొలు వైన గిరిజనుల ఆరాధ్యదైవం పోత రాజ్ ఉత్సవాలు ప్రారంభమయ్యా యి. మండలం లోని కోలాం గిరిజ నులు తమ ఇంటి దైవానికి ప్రతి యేటా పంటలు చేతికి వచ్చిన తరువాత పోతరాజుకు ఉత్సవాలు నిర్వ హించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తమ ఆరాధ్య దైవానికి కొత్త ధాన్యం తో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగ ణంలో కబడ్డీపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతీరాం, వైస్‌ఎంపీపీ కలాం, నిర్వాహకులు రాము, అన్నిగా, శేఖర్, చిన్న, భీము, దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత లంబాడితండా(డీ) జట్టు

కాసిపేట, జనవరి 14 : దేవాపూర్‌లో కొనసాగుతున్న రొడ్డ చిన్న రమేష్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో లంబాడి తండా(డి), రాంపూర్ జట్లు తలపడగా లంబాబితండా(డీ) జట్టు విజేతగా నిలిచింది. విజేతజట్టుకు రూ.5016, రన్నర్‌జట్టుకు రూ.3016 నగదు, మెమోంటో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ అందజేశారు. కొమ్ముల బాపు, దేవాపూర్ సర్పంచు మడావి తిరుమలఅనంతరావు, మద్దిమాడ సర్పంచు ఆడె జంగు, రొట్టెపల్లి సర్పంచు పెంద్రం కవితహన్మంతు, వెడ్మ కిషన్, భీంరావు, శ్రీమన్నారాయణ, పల్లె మల్లయ్యసంద్ర భూమయ్య, బద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు

తాండూర్, జనవరి 14 : రేపల్లెవాడలో నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ చెస్ పోటీలను ఆదివారం హనుమాన్ దేవాలయంలో నిర్వహించారు. ప్రథమ బహుమతి భువన్‌రుషి, ద్వితీయ ఆకుల అజయ్, తృతీయ మహేష్ గెలుచుకున్నారు. విజేతలకు మెమోంటోలను అందించారు. పోటీలకు చెస్ అంతర్జాతీయ క్రీడాకారుడు ఆకాష్‌కుమార్ హాజరయ్యారు. విశ్వనాథ్, కుమార్ బ్రదర్స్ అకాడమీ చైర్మన్ సమ్మయ్య, ఆకుల తిరుపతి, రామకృష్ణ, విజయ్, విగ్నేష్, మహేష్, సుధాకర్, కోచ్‌లు మహేష్, సుధాకర్,హీరాలాల్, మండల ఫోటోగ్రఫీ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కర్ణమామిడి జట్టు

హాజీపూర్, జనవరి 14 : గుడిపేటలో దివంగత కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు రాసమళ్ల అశోక్‌గౌడ్ స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో కర్ణమామిడి, వేంపల్లి జట్లు పాల్గొనగా కర్ణమామిడి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అందించిన రూ.20 వేలను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అందించారు. రన్నర్ జట్టుకు రూ. 10 వేలను అందజే శారు. ఒడ్డె శ్రీనివాస్, డీజే శేఖర్, కాంగ్రెస్ నాయకుడు పుస్కూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రవి, బొడ్డు శంకర్, ముడిమడుగుల శ్రీనివాస్, రాసమల్ల రవిగౌడ్, కృష్ణమూర్తి, అశోక్‌గౌడ్ కుటుంబీకులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



గూడెంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దండేపల్లి, జనవరి 14: గూడెం సత్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం గోదారంగనాయక స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు గోవర్ధన రఘస్వామి, సంపత్‌స్వామి, వేదపండితులు దిద్దళ్ల నారాయణశర్మ ఆధ్వర్యంలో కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. భోగి పండుగ సందర్భంగా సత్యదేవున్ని దర్శించుకున్నారు.

చెన్నూరు: జగన్నాథస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండగగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, భాజభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా కొనసాగింది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని యేటా కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు మోహనాచారి తెలిపారు. పండితులు అనిల్‌చారీ, అజయ్‌చారీ, భక్తులు పాల్గొన్నారు.

నస్పూర్: గోదావరికాలనీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు వెంకటరమణార్యులు ఆధ్వర్యంలో పూజలు, వేతమంత్రోత్సవాల మధ్య నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం దంపతులు బి. సంజీవరెడ్డి-రాధా కుమారిలు హాజరయ్యారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భీమారం: కోదండరామాలయంలో గోదా దేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు కన్నయ్య ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చేకుర్తి సత్యనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో జరిపించారు. చెన్నూరు ఎమ్మెల్యే తనయుడు, విశాఖ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మండపం, ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ చేకుర్తి సరోజ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా భోగి వేడుకలు



చెన్నూరులో పిల్లలకు పోస్తున్న భోగి పళ్లు

దండేపల్లి, జనవరి 14: భోగి పండుగ వేడుకలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. జీవితంలో భోగభాగ్యాలను ప్రసాదించాలని తెల్లవారుజామున ప్రజలు భోగి మంటలను కాగుతూ వేడుకలను నిర్వహించారు. ఇండ్ల ముందు ఆవుపేడ చల్లి అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మల్లో రేగు పండ్లు పెట్టి పూజలు చేశారు.

వేమనపల్లి: భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అందమైన ముగ్గులతో గ్రామాల్లోని కాలనీలు దర్శనమిచ్చాయి.

భీమారం: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇండ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు, రేగుపండ్లు గరక, బంతిపూలతో అలంకరించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో, మండలంలో భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఇండ్లలో పిండి వంటలు చేసుకున్నారు.

నస్పూర్: భోగి పండగను పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అందమైన ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలు, రేగుపండ్లు, గరిక, బంతిపూలు, ధాన్యంను వేశారు. చిన్న పిల్లలకు చిల్లర నాణేలతో దిష్టి తీసివేశారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటలు వేశారు. విశ్వనాథ ఆలయంలో గోదా దేవి రంగనాయకుల స్వామి కల్యాణం జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తీర్థ ప్రసాదాల అనంతరం అన్నదానం నిర్వహించారు.

సిర్సా క్రికెట్ టోర్నమెంట్ విజేత కోటపల్లి

కోటపల్లి, జనవరి 14 : సిర్సా గ్రామంలో స్వర్గీయ గొడిసెల లచ్చిరెడ్డి, మొండక్క, పాలమ్మల స్మారకార్థం వారం రోజులుగా కొనసాగుతున్న కోటపల్లి, వేమనపల్లి మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో కోటపల్లి జట్టు విజేతగా నిలిచింది. సభ్యుడు ఐత రాజేష్ 50 పరుగులు చేసి నాటౌట్ నిలిచాడు. కాగా మ్యాన్ ఆఫ్ మ్యాచ్‌గా నిలిచిన రాజేష్‌ను పోటీల నిర్వాహకులు శాలువాలతో సన్మానించి కప్ అందజేశారు. అనంతరం విజేత, రన్నర్ జట్లకు బహుమతులు అందించారు. నిర్వహకులు మహేందర్, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

కోటపల్లి, జనవరి 14: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలను విజయవంతం చేయాలని జెడ్పీ వైస్ మాజీ చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆలూరి సత్తయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. నాయకులు కేవీ ప్రతాప్, ఒడ్నాల శ్రీనివాస్, భూషణ్‌శర్మ, మనోహర్, పోటీల నిర్వాహకులు ఆలూరి సంపత్, యువకులు పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

నెన్నెల, జనవరి 14: యువతకు క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ అన్నారు. కోనంపేటలో కంకణాల వెంకన్న జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. యువకులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని కోరారు. మారుమూల గ్రామంలో టోర్నమెంట్ నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు తోడె బాపురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంటెంకి శ్రీనివాస్, రాఘవేందర్, సీతారాం, ప్రవీణ్, శంకర్, అంజీ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

మంచిర్యాల జిల్లా వార్తలు

5

సోమవారం 15 జనవరి 2024



రేషన్ బియ్యం సక్రమంగా అందించాలి

భీమారం, జనవరి 14 : రేషన్ షాపుల్లో ప్రతి లబ్ధిదారునికి సరుకులు అందించాలని తహసీల్దార్ విశ్వంభర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ రేషన్ షాపును ఆదివారం తనిఖీ చేశారు. స్టాకు వివరాలను పరిశీలించారు. ప్రతి డీలర్ స్టాకు వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు.



సంబరాల సంక్రాంతి

- వాకిళ్లలో ముచ్చట గొలిపే రంగవల్లులు
- గాలిపటాలతో చిన్నారుల కేరింతలు...
- గొబ్బెమ్మలు... రేగిపండ్లు
- నేడు సంక్రాంతి.... రేపు కనుమ

నస్పూర్/దండేపల్లి, జనవరి 14: పంట రాశులు.. వేకువజామునే హరినామ కీర్తనలతో హరిదాసులు... డూడూ బసవన్నలు... రంగురంగుల రంగవల్లులు.. గొబ్బెమ్మల కనువిందు.. యువతుల కోలహాలు.. గాలిప టాలు.. పిండివంటలు వెరసి.. లక్ష్మీదేవికి స్వాగతం పలికే శుభఘడియాలతో సంక్రాంతి పండుగ రానే వచ్చింది. పండిన పంట చేలు తెచ్చిన దిగుబడిలతో రైతుల కళ్లలో కనిపించే కొత్త కాంతికి సిసలైన ప్రతీక సంక్రాంతి.

మనిషి జీవనయానం ప్రకృతి ఆరాధనతోనే ప్రారంభమైంది. ప్రకృతిలోని శక్తులను పూజించడం, దైనందిన జీవితాన్ని కొనసాగించడం అనాదిగా వస్తోంది. ఆచార సంప్రదాయాల నుంచి వచ్చినవే పండుగలు. వాటిని ప్రకృతి శక్తులను ఆరాధించడం పూర్వకాలం నుంచి వస్తోంది.

ఇంటిల్లిపాది ఆనందోత్సవాలతో సందడి చేసి ఆటాపాటల్లో నిమగ్నమవుతారు. జిల్లాలోని పల్లె ప్రాంతాల్లో సంక్రాంతి సంబరం, కనుమ సంబరాలు చూడముచ్చ టగా జరుగుతాయి. ఆరుగాలం శ్రమించిన రైతుల ఇంటి నిండా ధాన్య రాశులతో తులతూగే సమయంలో అన్నదాత ఆనందం పిల్లాపాపలతో, కుటుంబ సభ్యులు బంధుగణం కలిసి ఉత్సహంతో జరుపుకునే పండగ, రైతన్న ఇంటా నిండైనా పండగ అనుబంధాల కలయిక సంక్రాంతి....

మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. దక్షిణాయనం ముగిసి ఉత్తరాయణం పుణ్యకాలం ప్రారంభమవుతుంది. ఈ రోజున స్వర్గ వాకిళ్ల తెరుస్తారని ప్రజల నమ్మకం. బెల్లం, గుమ్మడికాయలు దానమిస్తారు. పితృదేవతలకు తర్పణాలు వదులుతారు.



మంచిర్యాలలో ఆకట్టుకొన్న ముగ్గు

సంక్రాంతి...

27 నక్షత్రాలు, నక్షత్రానికి నాలుగు పాదాలు, మొత్తం 108 పాదాలు, ఆ పాదాలను 12 రాశులుగా విభజిస్తే సూర్యుడు నెలకో రాశిలోకి వెళుతాడు. జనవరి నెలలో సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడం వలన మకర సంక్రాంతిగా పిలుస్తారు. సంక్రాంతి వచ్చిందంటే ప్రతి ఇంటి ముంగిట కల్లాపి చల్లి ముగ్గులు వేయడం వలన లోగిలికి రంగుల అందం చేకూరుతోంది. సంక్రాంతి సంబరం మూడు రోజులపాటు జరుగుతుంది. ఉపాధి కోసం వెళ్ళిన కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు కుటుంబాలతో స్వగ్రామాలకు చేరుతారు.

హరిదాసులు...

సంక్రాంతి సమయంలోనే హరిదాసులు కనిపిస్తారు. హరిదాసు కీర్తనలు ఆధ్యాత్మిక సమాజ శ్రేయస్సు సాగడం, మనిషిలోని దానగుణాన్ని పెంపొందించేందుకు దోహదం చేస్తాయి. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో పండగ కళ తెచ్చి పెడుతోంది. పల్లెల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల నగర సంకీర్త నల సందడి గొబ్బిళ్ళతో అలంకరణలతో పల్లె, పట్టణ వాకిళ్ళు చూడముచ్చటగా కనిపిస్తాయి. హరిదాసులు చేతిలో చిరుతలు, తంబుర వాయిద్యం తలమీద అక్షయ పాత్రను పెట్టుకుని నగర సంకీర్తనకు వస్తారు.

కనుమ పండగ...

మూడురోజుల సంక్రాంతి పండగలో చివరిది కనుమ. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో కీలకంగా వ్యవహారించే ఎద్దులు, ఆవులు, మేకలు ఆ రైతు కుటుంబంలో భాగంగా నిలుస్తాయి. వ్యవసాయ రంగంలో కష్ట, సుఖాల్లో తోడూ నీడగా నిలిచిన పశువులను ప్రత్యేకంగా పూజిస్తారు. పండగ రోజున పశు సంపదకు స్నానం చేయించి కుంకుమ, పసుపు, రాసి, బొట్టు పెట్టి మెడలో పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. పాడి పంటల అభివృద్ధికి అనుగ్రహించాలని దేవతామూర్తులను ప్రార్థిస్తారు. పుట్టింటికి వచ్చిన ఆడ బిడ్డలు, అల్లుళ్ళు, కుటుంబ సభ్యులతో ఇంటిల్లిపాది సంతోషంగా గడుపుతారు.